సాక్షి ప్రకాశం
శనివారం । 2 । నవంబర్ । 2024



ఒంగోలులో నరకాసురుని బొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

దీపావళి వేడుకల చిత్రమాలిక - 8లో..



ఇళ్ల మధ్య మద్యం షాపు వద్దంటూ నిరసన

ఇళ్ల మధ్యలో మద్యం షాపు పెట్టవద్దంటూ పెద్దదోర్నాల మండల పరిధి ఐనముక్కల వాసులు రాస్తారోకో చేశారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
34.3/26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

అమరజీవికి అవమానం

- అధికారికంగా ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం నిర్వహించని ప్రభుత్వం



ఒంగోలు అర్బన్: ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం నవంబర్ 1వ తేదీని ప్రభుత్వ పరంగా అధికారికంగా నిర్వహించలేదు. కానీ ఆయన అభిమానులు మాత్రం శుక్రవారం జిల్లావ్యాప్తంగా పలుచోట్ల ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించారు. జిల్లా అధికార యంత్రాంగం ఆ దిశగా ఎటువంటి కార్యక్రమం ఏర్పాటు చేయలేదు. కనీసం ఆయన విగ్రహానికి దండ వేసి నివాళులర్పించలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నవంబర్ 1వ తేదీనే ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవంగా ప్రకటించి కార్యక్రమాలు అధికారికంగా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం మాత్రం నిర్వహించకపోవడంపై సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

వైద్యం కోసం వెళితే వీడియో తీశారు

ఒంగోలు టౌన్: ఆయుర్వేద వైద్య చికిత్స కోసం వెళితే రహస్యంగా వీడియో తీస్తున్నారంటూ ఒక మహిళ ఆరోపణ చేయడం కలకలం సృష్టించింది. పోలీసుల కథనం ప్రకారం... నగరంలోని సంతపేటలో కలెక్టర్ కార్యాలయం పక్క వీధిలో ఒక ఆయుర్వేద ఆస్పత్రి ఉంది. అక్కడ పంచకర్మ వైద్య చికిత్స కోసం శుక్రవారం సాయంత్రం ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మహిళలు వెళ్లారు. ఒక ప్రత్యేక గదిలో ముందుగా ఒక మహిళకు పంచకర్మ చికిత్సలో భాగంగా మసాజ్ చేశారు. ఆ తరువాత రెండో మహిళకు చికిత్స చేయాల్సి ఉంది. లోపల ఎవరో రహస్యంగా వీడియో చిత్రీకరిస్తున్నట్లు మొదట మసాజ్ కు వెళ్లి వచ్చిన మహిళ అనుమానం వ్యక్తం చేశారు. దాంతో ఆ మహిళలు ఈ విషయాన్ని తమ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పారు. వెంటనే అక్కడకు 10 మంది యువకులు చేరుకుని గందరగోళం సృష్టించారు. ఆస్పత్రి సిబ్బంది సెల్ ఫోన్లు లాక్కొని పగులగొట్టినట్లు చెబుతున్నారు. దాంతో ఆస్పత్రి నిర్వాహకుడు టూ టౌన్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

దీపం గ్యాస్ పంపిణీ




దీపం గ్యాస్ పంపిణీ కార్యక్రమంలో మంత్రి స్వామి, పక్కన కలెక్టర్

ఒంగోలు సబర్బన్: దీపం 2.0 పథకంలో భాగంగా శుక్రవారం ఒంగోలులో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయ స్వామి పంపిణీ చేశారు. ఈ మేరకు స్థానిక సంతపేటలోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.సబ్సిడీ కింద ప్రకాశం జిల్లాలో మహిళలకు రూ.41 కోట్లు చెల్లిస్తున్నామని వెల్లడించారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ సిలిండర్ బుక్ చేసుకున్న 48 గంటల్లో రాయితీ సొమ్ము లబ్ధిదారుల ఖాతాలో జమవుతుందని పేర్కొన్నారు. గ్యాస్ సిలిండర్లను లబ్ధిదారులైన మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మేయర్ సుజాతతో పాటు పలువురు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి నెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

దొనకొండ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, అండర్ 17 బాల బాలికల నెట్ బాల్ సెలక్షన్స్‌ను పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నరసింహారావు నిర్వహించారు. ఈ ఎంపికకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 120 మంది క్రీడాకారులు పాల్గొనగా వారిలో ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేశారు. ఈ ఆటల పోటీలకు ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి 2 షేక్.అమీర్ పోటీలను ప్రారంభించారు. క్రీడా ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు పొందేందుకు క్రీడలు చాలా ఉపయోగ పడతాయని ఎంఈఓ తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు ప్రసంగించారు.





వెలుగొండకు చంద్ర గ్రహణం

ఎప్పటిలాగే తెలుగుదేశం ప్రభుత్వం వెలుగొండ ప్రాజెక్టుపై డ్రామాలు మొదలెట్టేసింది. దాదాపు రెండున్నర దశాబ్దాలకు పైగా ఈ ప్రాజెక్టుపై గోబెల్స్ ప్రచారం చేసింది. వైఎస్సార్, వైఎస్ జగన్ హయాంలో జరిగిన అభివృద్ధిని తన ఖాతాలో వేసుకునే దౌర్భాగ్య స్థితికి దిగజారుతోంది. అధికారంలో ఉన్నన్నాళ్లూ చంద్రబాబు ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారు. ఆయన హయాంలోనే ఈ ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. వాస్తవానికి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పనులు ప్రారంభమై శరవేగంగా సాగితే వాటిని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో ముందుకు తీసుకెళ్లారు. రెండు సొరంగాల పనులు పూర్తి చేశారు. తాజాగా టీడీపీ మంత్రులు ఈ ప్రాజెక్టు సందర్శన పేరుతో సరికొత్త నాటకానికి తెరతీశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పనులేమీ జరగలేదంటూ గోబెల్స్ ప్రచారానికి దిగారు. పనులు పూర్తి చేసి నీళ్లు మేమే ఇస్తామంటూ ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని జిల్లా వాసులు మండిపడుతున్నారు.

- 1997లో శంకుస్థాపనతో సరిపెట్టిన చంద్రబాబు
- దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో శరవేగంగా పనులు
- 2014 నుంచి ఐదేళ్లూ ప్రాజెక్ట్ పనులు గాలికి..
- వైఎస్ జగన్ హయాంలో పూర్తయిన రెండు సొరంగాల నిర్మాణాలు
- శ్రీశైలం బ్యాక్ వాటర్ హెడ్ రెగ్యులేటరీ పనులు సైతం పూర్తి
- వైఎస్సార్ సీపీ హయాంలో పనులు జరగలేదంటూ మంత్రుల అసత్య ప్రచారం
- పుల్లలచెరువు కాలువ చూపించి తప్పుడు ప్రకటనలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లోని సాగునీరు, తాగునీరు అందించడమే లక్ష్యంగా 2004, అక్టోబరు 27న వెలుగొండ ప్రాజెక్టుకు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి శ్రీకారం చుట్టారు. జలయజ్ఞంలో భాగంగా చేపట్టిన పనులకు సంబంధించి రూ.8,043.85 కోట్లకు పరిపాలన అనుమతులు కూడా ఇచ్చారు. పనులు వేగంగా జరిగాయి. రూ.3,610.38 కోట్లు ఖర్చుచేసి.. 37.587 కిమీల పొడవైన జంట సొరంగాల్లో 20.333 కి.మీ.ల పనులు, ఆ ప్రాజెక్టులోనే అంతర్భాగమైన నల్లమల సాగర్‌ను పూర్తిచేశారు. ఇక చంద్రబాబు హయాంలో ఈ ప్రాజెక్టుకు గ్రహణం పట్టిందనే చెప్పాలి. 1997లో వెలిగొండ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేసిన చంద్రబాబు సర్వే పేరుతో ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించకుండా తన నైజాన్ని ప్రదర్శించిన విషయాన్ని జిల్లా ప్రజలు మరిచిపోలేదు. 2014 నుంచి 2019 వరకు ఐదేళ్ల లో ఐదు సార్లు ఉమ్మడి జిల్లాకు వచ్చారు. వచ్చినప్పుడల్లా త్వరలో వెలుగొండను ప్రారంభించి పశ్చిమ ప్రకాశాన్ని సస్యశ్యామలం చేస్తానని హామీలు గుప్పిస్తూనే వచ్చారు. 2018 జూన్ నెలలో జిల్లాకు వచ్చిన చంద్రబాబు 2019 సంక్రాంతికల్లా వెలుగొండను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తానని ప్రకటిస్తూనే వచ్చారు.

రూ.630 కోట్లు కాంట్రాక్టర్‌కు దోచిపెట్టిన బాబు

2014–19 మధ్య ఈ ప్రాజెక్టుకు రూ.1,385.81 కోట్లు ఖర్చు చేసినా కాంట్రాక్టర్లకు ఉత్తినే రూ.630.57 కోట్లు దోచి పెట్టడాన్ని కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్) నివేదిక బయటపెట్టింది. ఈ ప్రాజెక్టు పనులను తన బినామీ అయిన అప్పటి ఎంపీ సీఎం రమేష్‌కు నామినేషన్ మీద అప్పగించి వందల కోట్ల రూపాయలు దోచుకున్నది చంద్రబాబేనన్న ఆరోపణలు వెల్లువెత్తిన విషయం అందరికీ తెలిసిందే. వెలుగొండకు ఖర్చుచేసిన నిధులను చంద్రబాబు మింగేయడంవల్లే ఎక్కడి పనులు అక్కడే మిగిలిపోయాయి.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వేగంగా పనులు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయిన నాటి నుంచి వెలుగొండ ప్రాజెక్టు పనులు వేగంగా జరిగాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగారు. రూ.978.02 కోట్లు ఖర్చుచేసి.. అందులో ప్రతి పైసాను సద్వినియోగం అయ్యేలా చేశారు. వెలుగొండ జంట సొరంగాల్లో మిగిలిన 10,568 కి.మీ.ల పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి, జాతికి అంకితం చేశారు. శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో ఉన్న రెండు హెడ్ రెగ్యులేటర్ నిర్మాణ పనులను సైతం పూర్తి చేశారు.

మంత్రుల మాటలతో నవ్వుకుంటున్న ప్రజలు

అయితే ఇటీవల వెలిగొండ ప్రాజెక్టును రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, స్వామి, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి పర్యటించారు. నాటకాలాడం... మోసం చేయం...అని మంత్రులు కూడా చంద్రబాబు తరహాలోనే మాట్లాడారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు దాటుతోంది. ఇప్పటి వరకు వెలుగొండ ప్రాజెక్టుపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం. మంత్రుల అసత్య ప్రచారాలతో వెలుగొండ ప్రాజెక్టు సందర్శన ఒక టూర్ ప్రోగ్రాం మాదిరిగా తయారు చేసుకొని వెళ్లారు. పుల్లలచెరువు కాలువ చూపించి వెలుగొండ ప్రాజెక్టు కాలువ చూడండి అంటూ చెప్పటంతో చెరువు కాలువకు, ప్రాజెక్టు కాలువకు కూడా తేడా తెలియదా అని జనం ప్రశ్నిస్తున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో అసలు పనులేమీ జరగలేదన్నట్టు ఇరిగేషన్ శాఖ మంత్రి రామానాయుడు చేసిన వ్యాఖ్యలపై జిల్లా వాసులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

వెలిగొండ ప్రాజెక్టుపై ఉద్యమిస్తాం



పశ్చిమ ప్రాంత ప్రజలకు సాగు, తాగునీరు అందించే వెలుగొండ ప్రాజెక్టు ద్వారా నీరు వదిలేందుకు చర్యలు తీసుకోకపోతే ఉద్యమిస్తాం. ప్రాజెక్టు నుంచి అమరావతి వరకు లక్ష మంది రైతులతో పాదయాత్ర చేస్తాం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇంత వరకు ప్రాజెక్టు నుంచి తట్టెడు మట్టి ఎత్తి వేయించలేకపోయారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి పైసా ఖర్చు పెట్టలేదు. ఈ ప్రాజెక్టును వదిలించుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. రాష్ట్ర మంత్రులు తూ తూ మంత్రంగా పర్యటించి సంపూర్ణంగా పూర్తయిన టన్నెల్స్, స్టోరేజి ట్యాంకు కళ్ల ఎదుట కనపడుతున్నా కాకమ్మ కబుర్లు చెప్తూ కాలక్షేపం చేశారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు ఇవ్వాల్సిన ప్యాకేజీ, నివాస సముదాయాలు పూర్తి చేయాలి. 6 నెలలకు కూటమి ప్రభుత్వం రూ.60 వేల కోట్ల అప్పు చేసింది. అందులో 10 శాతం ఖర్చుపెట్టినా పశ్చిమ ప్రాంత ప్రజల కలలు సాకారమయ్యేవి.

– **తాటిపర్తి చంద్రశేఖర్**, యర్రగొండపాలెం ఎమ్మెల్యే

గత ప్రభుత్వంలో శరవేగంగా పనులు



వెలుగొండ ప్రాజెక్ట్ పనులకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిది. మా ప్రభుత్వ హయాంలో మిగిలిన రెండు టన్నెల్ పనులు పూర్తి చేశాం. కరోనా కష్టకాలంలో కూడా ప్రాజెక్ట్ పనులకు నిధులు కేటాయించి పనులు పరుగులు తీయించి టన్నెల్ పనులు పూర్తిచేయించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. రాజశేఖరరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వెలుగొండ ప్రాజెక్ట్‌కు ఎంత కేటాయించారో, టీడీపీ హయాంలో ప్రాజెక్టుకు ఎంత కేటాయించారో వ్యత్యాసం ప్రజలందరికీ తెలుసు.

– **డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి**, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే

వెలిగొండ ప్రాజెక్టు వివరాలు..వ్యయం ఇలా..

వెలిగొండ ప్రాజెక్ట్ సామర్థ్యం: **45** టీఎంసీలు
సాగునీరు: ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో **5** లక్షల ఎకరాలకు..
తాగునీరు: **15** లక్షల మందికి
ప్రాజెక్టు అంచనా వ్యయం: రూ.**10,010.54** కోట్లు
పరిపాలన అనుమతి: రూ.**8,043.85** కోట్లు

2004–14 (వైఎస్సార్ హయాంలో వ్యయం: రూ.**3,610.38** కోట్లు)
పనులకు: రూ.**2,890.17** కోట్లు
భూ సేకరణకు: రూ.**262.64** కోట్లు
పునరావాస కల్పనకు: రూ.**20.53** కోట్లు
అటవీ అనుమతులకు: రూ.**437.04** కోట్లు

2014–19 మధ్య వ్యయం (చంద్రబాబు హయాంలో): రూ.**1,385.81** కోట్లు
పనులకు: రూ.**1,208.35** కోట్లు
భూసేకరణకు: రూ.**114.89** కోట్లు
పునరావాసం కల్పనకు: రూ.**62.57** కోట్లు

2019 మే 30 నుంచి ఇప్పటి వరకూ (సీఎం జగన్ హయాంలో) వ్యయం: రూ.**978.02** కోట్లు
పనులకు: రూ.**822.08** కోట్లు
భూసేకరణకు: రూ.**79.21** కోట్లు
పునరావాస కల్పనకు: రూ.**76.73** కోట్లు

ఇప్పటి వరకూ ప్రాజెక్టు కోసం ఖర్చు చేసింది: రూ.**5,974.21** కోట్లు

మంత్రుల మాటలు నమ్మశక్యంగా లేవు



వచ్చే సీజన్‌లో పనులు పూర్తి చేసి వెలుగొండ ప్రాజెక్టు ద్వారా సాగు నీరు అందిస్తామన్న టీడీపీ మంత్రుల మాటలపై మాకు నమ్మకం లేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టుపై చంద్రబాబు నాయుడు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో వెలుగొండ ప్రాజెక్టుకు సంబంధించిన పనులు జరగలేదంటూ రాష్ట్ర మంత్రులు ప్రకటించటం మరీ దారుణం. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే మొదటి టన్నెల్ పూర్తి చేసి, రెండో సొరంగ నిర్మాణ పనుల్లో లైనింగ్ పనులు తప్ప మిగతా పనులు దాదాపు పూర్తయిన సంగతిని మంత్రులు మరిచిపోయినట్లు ఉన్నారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేసి నీళ్లిస్తామంటూ మంత్రులు చేసిన ప్రకటన హాస్యాస్పదంగా ఉంది.

– డి.వెంకటేశ్వరరెడ్డి, కొత్తూరు గ్రామం, పెద్దదోర్నాల, మండలం

పింఛన్ పాట్లు

- అవాంతరాల నడుమ పింఛన్ల పంపిణీ
- మొరాయించిన సర్వర్, రీచార్జ్ కాని బయోమెట్రిక్ మిషన్లు
- అవస్థలు పడిన వృద్ధులు, వికలాంగులు
- కొన్ని చోట్ల అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం
- చాలా చోట్ల సచివాలయాల్లోనే పింఛన్ల పంపిణీ



ఒంగోలులో రాత్రిపూట పింఛన్ల కోసం పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు



గార్లపేట మీసేవా కేంద్ర వద్ద పింఛన్ల కోసం పడిగాపులు కాస్తున్న పింఛన్‌దారులు

ఒంగోలు వన్‌టౌన్: జిల్లాలో శుక్రవారం నిర్వహించిన సామాజిక పింఛన్ల పంపిణీ ప్రక్రియ ప్రహసనంగా మారింది. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా దానికి విరుద్ధంగా సచివాలయాలు, మీసేవ కేంద్రాల వద్దకే పిలిపించి గంటల తరబడి నిలబెట్టి వృద్ధులు, వికలాంగులను నానా అవస్థలు పెట్టారు. లబ్ధిదారులు పనులన్నీ మానుకుని సచివాలయాల వద్దకు వచ్చి పడిగాపులు కాశారు. సర్వర్ సమస్యలతో గంటల తరబడి పంపిణీ నిలిచిపోయింది. శుక్రవారం రాత్రి 8 గంటల సమయానికి 93 శాతం వరకూ పెన్షన్‌లను పంపిణీ చేసినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ టీ వసుంధర తెలిపారు. 2,87127 మంది పెన్షన్‌దారులకు గాను 2,59998 మందికి పెన్షన్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. మిగిలినవి శనివారం పెన్షన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

మొరాయించిన సర్వర్

కనిగిరి రూరల్: నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పింఛన్ల పంపిణీ ప్రక్రియ అనేక అవాంతరాల నడుమ ఆలస్యంగా ప్రారంభమైంది. సచివాలయ సిబ్బంది 6 గంటలకే పింఛన్ల పంపిణీ ప్రారంభించిన చోట 7 గంటల లోపు సర్వర్ మొరాయిస్తున్నా ఫేస్ స్కాన్ ద్వారా కొందరికి పంపిణీ చేశారు. 7 గంటల తర్వాత పూర్తిగా సర్వర్ నిలిచింది. మధ్యాహ్నం 12 గంటల వరకు పూర్తి స్థాయిలో సర్వర్ పనిచేయలేదు. పట్టణంలోని కాశిరెడ్డి కాలనీలో (11,12 వార్డులు) సర్వర్ సమస్యతో పాటు సచివాలయ సిబ్బంది ఆలస్యం, నిర్లక్ష్యంతో పింఛన్ల పంపిణీలో జాప్యం జరిగింది. దీంతో సచివాలయ వద్దకు వచ్చిన వృద్ధులు, వికలాంగులు అవస్థలు పడ్డారు. సర్వర్ వచ్చిన తర్వాత కూడా ఇళ్లకు వెళ్లకుండా ఆఫీస్ వద్దే పంపిణీ చేశారు. దీనికి తోడు కొన్ని సచివాలయాలకు చెందిన బయోమెట్రిక్ మిషన్లు ఇయర్‌లీ రెన్యువల్ (రీచార్జ్) చేయలేదు. దీంతో ఆయా మిషన్లు పింఛన్‌దారుల ఆప్షన్లు తీసుకోలేదు. సమస్యను డీఆర్‌డీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో దాన్ని రెన్యువల్ చేశాక అవి పనిచేశాయి. కనిగిరి రూరల్‌తో పాటు పీసీపల్లి, హెచ్‌ఎంపాడు, వెలిగండ్ల, సీఎస్‌పురం, పామూరు మండలాల్లో ఇదే తంతు జరిగింది.

సచివాలయాల వద్దే పడిగాపులు

కొమరోలు: సర్వర్ సమస్యతో పింఛన్లు పంపిణీ కాకపోవడంతో కొమరోలులోని గ్రామ సచివాలయంలో వృద్ధులు చెట్ల కింద పడిగాపులు కాశారు. ఇంటింటికీ పంపిణీ చేయాల్సి ఉండగా.. దానికి విరుద్ధంగా కొమరోలు గ్రామ సచివాలయానికి లబ్ధిదారులను పిలిపించి మరీ పింఛన్ నగదు అందించారు.

అధికారుల చెంతకు ప్రజలు

సింగరాయకొండ: మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రజల వద్దకు అధికారులు కాకుండా అధికారుల చెంతకే ప్రజలు అన్న చందంగా సాగుతోంది. మండలంలోని పాతసింగరాయకొండ, శానంపూడి, తదితర చోట్ల పింఛన్ల పంపిణీ సక్రమంగా సాగలేదు. మండలంలో ఎక్కువ శాతం మంది అధికారులు ఏదో ఒక సెంటర్‌లో కూర్చొని పింఛన్లు ఇచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సర్వర్ పనిచేయకపోవటంతో పింఛన్‌దారులు అరుగు వద్ద వేచి ఉండాల్సి వచ్చింది.

పింఛన్ కావాలంటే మీసేవా కేంద్రానికి రావాల్సిందే...

మర్రిపూడి: ఇంటింటికీ పింఛన్ల పంపిణీని పక్కనబెట్టి గ్రామాల్లోని పింఛన్‌దారులను ఒక ప్రదేశానికి పిలిపించుకుని గుంపులు, గుంపులుగా గంటల కొద్దీ నిలబెట్టుకుంటున్నారు. దీనికి తోడు మధ్యాహ్నం వరకు సర్వర్లు మొరాయించాయి. సర్వర్‌లు పని చేయకపోవడంతో పింఛన్‌దారులు విసిగి వేసారి కొందరు ఇంటి ముఖపట్టారు. మరి కొంతమంది పింఛన్‌దారులు అధికారులు చెప్పిన ప్రదేశంలోనే పడిగాపులు కాశారు. మండలంలోని గార్లపేట గ్రామంలో డిజిటల్ అసిస్టెంట్ పనిచేస్తున్న కామేశ్వరరావు శుక్రవారం పింఛన్‌దారులను మీసేవా కేంద్రం వద్దకు పిలిపించుకుని పింఛన్‌ను అందజేశారు.



కనిగిరిలో సచివాలయం వద్ద పింఛన్ల పంపిణీ



పీసీపల్లిలో పెన్షన్ కోసం ఎదురు చూస్తున్న వృద్ధులు



పాతసింగరాయకొండ పంచాయతీలో సర్వర్ పనిచేయక వేచి ఉన్న పింఛన్‌దారులు



కొమరోలు గ్రామ సచివాలయంలో చెట్ల కింద పడిగాపులు పడుతున్న పింఛన్‌దారులు

వచ్చే నెల 13 నుంచి సీపీఎం జిల్లా మహాసభలు

ఒంగోలు సిటీ: సీపీఎం జిల్లా మహాసభలు డిసెంబరు 13, 14, 15వ తేదీల్లో చీమకుర్తిలో నిర్వహించనున్నట్లు సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ తెలిపారు. స్థానిక సుందరయ్య భవన్‌లో శుక్రవారం మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను పార్టీ జిల్లా కార్యవర్గసభ్యులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వెనకబడిన జిల్లాగా గుర్తించినట్లు ఇటీవల బడ్జెట్ సమావేశాల సందర్భంగా కేంద్రం ప్రకటన చేసింది తప్ప అభివృద్ధికి సంబంధించి ఆచరణలో ఎలాంటి నిధులు విడుదల చేయలేదని విమర్శించారు. జిల్లాలో రైతాంగ ఉద్యమాలు, కార్మిక పోరాటాలు, వ్యవసాయ కార్మికుల స్థితిగతులపై పార్టీ జిల్లా మహాసభల్లో చర్చిస్తామని తెలిపారు. రైతులు, రైతు కూలీలు, కార్మికులు, విద్యార్థులు, యువజనులు అన్నీ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభల్లో సమగ్రంగా చర్చిస్తారని తెలిపారు. జిల్లాలో ప్రజాసమస్యలను ప్రస్తావిస్తూ, జిల్లా అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరుతూ ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు ప్రచార కార్యాక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15వ తేదీ తహశీల్దార్ కార్యాలయాలు, జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా ఉంటుందని తెలిపారు. డిసెంబరు 13వ తేదీ సాయంత్రం చీమకుర్తిలో భారీ ప్రదర్శన, బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14, 15 వ తేదిల్లో ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. ఈ సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, కారుసాల సుబ్బరావమ్మ, కె.ఉమామహేశ్వరరావు హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా పాలకుల చర్యలు కనిపించడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జీవీ కొండారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, పునాటి ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



సీపీఎం మహా సభల వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్

జాతీయ కరాటే పోటీలకు జిల్లా విద్యార్థులు

ఒంగోలు: జాతీయ కరాటే పోటీలకు ప్రకాశం జిల్లా నుంచి పెద్ద ఎత్తున విద్యార్థినీ విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక భాగ్యనగర్‌లోని గౌతం మోడల్ స్కూలులో శుక్రవారం కటా విభాగంలో నిర్వహించిన పోటీలను అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు టి.శ్రీనివాసరెడ్డి, బాపట్ల జిల్లా కార్యదర్శి కె.రఘునాథబాబు, ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎస్‌వీకే ప్రసాద్‌బాబు, గౌతం మోడల్ స్కూల్ కరస్పాండెంట్ యం.కొండయ్య, డీన్ కె.అలెక్స్‌లు పర్యవేక్షించారు.

కటా విభాగం– సబ్ జూనియర్స్ బాలురు: జి.సాయిరాం శౌర్య, జి.కుశాల్ గుప్తా, ఎల్.విక్రాంత్ సాయి శ్రీనివాస్, బి.కుశాల్‌రెడ్డి, బి.నాగహనీష్, ఎస్.తనూజ్, సీహెచ్ అషీర్, పి.జోత్స్న స్నేహ్, యం.రోషన్ సాయి, పి.మన్విత్, పి.మనోజ్‌సాయి చరణ్, ఎస్‌కె అయాన్, ఆర్.నాగలోకేష్, డి.జావీద్ ఖాశిం, వి.గౌతమ్ వర్షిత్, జి.శౌర్య, పి.మోక్షజ్ఞ

కటా విభాగం–బాలురు జూనియర్స్: ఎస్.జశ్వంత్, యు.షణ్ముఖ వరుణ్, ఎ.నిఖిత్ సాయి నందన్, జె.రుత్విక్ బాబు, జి.సూరజ్ కృష్ణ యాదవ్, సీహెచ్ ఖాజా రహంతుల్లా, కె.కౌషిక్ సాయి ప్రజ్వల్, టి.మహేష్, కె.నందకిషోర్, కె.సాయి అఖిలేష్ యాదవ్, డి.మహేష్ సాయి, డి.యశ్వంత్, టివి జగత్ నాగసాయి, పి.తేజ వర్ధన్, ఎస్‌విఎస్ సాయి అనురూప్.



జాతీయ కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులు

కటా విభాగం– బాలికలు సబ్ జూనియర్స్: యం.కీర్తి, జి.జ్యోత్స్న, ఈ.దేదీప్య, టి.జోషిక, కె.యోషిత, టి.జోషిత, వి.మన్వితారెడ్డి, వి.నందిక, యం.నాగ రుషిత, జి.గ్రేషియో, పి.కీర్తిక, బి.హరిప్రియ, ఎల్.ధరణిశ్రీ, డి,లావణ్య, జి.లాస్య చరన్విరెడ్డి

కటా విభాగం–బాలికలు జూనియర్స్: ఎల్.ఆకాంక్ష, ఎస్.ప్రశాంతి, ఎస్‌ఎస్‌ఎస్ దీపాంజలి, జి.వర్షినీరెడ్డి, డి.శ్రీజ, సీహెచ్ గీతాంజలి సాయి, జి.చాతుర్య, సీహెచ్ హేమ ప్రియ, కె.అనన్య శ్రీనాగ లక్ష్మి సాయి, వి.జయకీర్తి, సీహెచ్ అక్షర, కె.అమూల్య, పి.యు.ప్రవీణ, టి.జయశ్రీరెడ్డి.


ఒంగోలు రీడింగ్ రూమ్ వద్ద నరకాసుర వధ


ఒంగోలులో నరకాసుర దహనాన్ని తిలకిస్తున్న నగరవాసులు


ఒంగోలులో బాణసంచా కాల్చుతూ సందడి చేస్తున్న యువతులు


రాధాకృష్ణుల నృత్య రూపకం

సంబరాల కేళి

దీపావళి పర్వదినాన్ని జిల్లాలో గురువారం ఘనంగా నిర్వహించారు. చిన్నా పెద్ద తేడా లేకుండా బాణసంచా కాలుస్తూ సందడి చేశారు. ఒంగోలు, మార్కాపురంలో నరకాసుర దహనం ఘట్టాలు అశేష భక్త జనం మధ్య అట్టహాసంగా సాగాయి. – సాక్షి నెట్‌వర్క్


బాణసంచా వెలుగులో ఒంగోలు నగర వ్యూ..


బాణసంచా కాలుస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ


కొండపి : దీపాలు అలంకరిస్తున్న చిన్నారి


కనిగిరిలో..


మార్కాపురంలో చెన్నకేశవస్వామి ఊరేగింపు


మార్కాపురంలో నరకాసుర దహనం

4 నుంచి డైట్ విద్యార్థులకు పరీక్షలు

ఒంగోలు సిటీ: డైట్ మొదటి సంవత్సరం ఫెయిలైన విద్యార్థులు, డైట్ రెండో సెమిస్టర్ రెగ్యులర్ విద్యార్థులకు ఈ నెల 4వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈఓ ఎ.కిరణ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెండో సెమిస్టర్ రెగ్యులర్ విద్యార్థులకు మైనంపాడు గవర్నమెంట్ హైస్కూల్, అలాగే మొదటి సంవత్సరం ఫెయిలైన విద్యార్థులకు ఒంగోలు రామ్‌నగర్‌లోని మున్సిపల్ హైస్కూల్, దర్శి గవర్నమెంట్ హైస్కూల్, మార్కాపురం జిల్లా పరిషత్(బాలుర) ఉన్నత పాఠశాల కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. హాల్ టికెట్లను డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

పింఛను నగదు మాయంపై హైడ్రామా!

- రూ.5 లక్షలు పోయాయని పోలీసులకు ఫిర్యాదు చేసిన పోలవరం వెల్ఫేర్ సెక్రటరీ
- ఎంపీడీఓ హెచ్చరించడంతో నగదు తెచ్చి పంపిణీ

ముండ్లమూరు(దర్శి): పింఛను నగదు చోరీ అయినట్లు ఫిర్యాదు చేసిన వెల్ఫేర్ సెక్రటరీ.. కొద్ది గంటల వ్యవధిలోనే ఆ నగదు భద్రంగా ఉందని చెప్పిన ఉదంతమిది. ఈ క్రమంలో చోటుచేసుకున్న హైడ్రామా దర్శి నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళ్తే.. ముండ్లమూరు మండలం పోలవరం గ్రామ సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ జగన్నాథం జశ్వంత్ దర్శి కెనరా బ్యాంక్‌లో బుధవారం సాయంత్రం శంకరాపురం, పోలవరం గ్రామాల పింఛను నగదు రూ.32,17,500 డ్రా చేశారు. తన బావ లింగతోట రవికిషోర్ కారులో శంకరాపురం వెళ్లారు. అక్కడి వెల్ఫేర్ అసిస్టెంట్ ఇట్టా చంద్రశేఖర్ సెలవులో ఉన్నాడు. అయితే రెండు గ్రామాల్లో సచివాలయ సిబ్బందికి సుమారు రూ.12 లక్షలు అందించి మిగిలిన నగదును ఒంగోలులో ఉంటున్న శంకరాపురం వెల్ఫేర్ సెక్రటరీకి ఇచ్చేందుకు బయలుదేరారు. ఈ క్రమంలో బ్యాగులో ఉన్న రూ.5 లక్షలు మాయమైనట్లు ఎంపీడీఓ జనార్దన్‌కు చెప్పి, పోలీసులకూ ఫిర్యాదు చేశారు. ఎంపీడీఓ పోలీసులతో కలిసి బ్యాంక్ వద్ద విచారించారు. డబ్బు తిరిగి తీసుకురాకుంటే ఉద్యోగం పోగొట్టుకుని, కేసు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎంపీడీఓ హెచ్చరించడంతో జశ్వంత్ నగదు భద్రంగానే ఉందనడం గమనార్హం. పింఛనుదారులకు నగదు పంపిణీ చేయడమే కాకుండా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదును సైతం వెనక్కి తీసుకున్నారు.

రుధిర దారులు

- కొనకనమిట్ల, పెద్దారవీడు, పొదిలి మండలాల్లో రోడ్డు ప్రమాదాలు
- బైక్ అదుపు తప్పి భార్య కళ్లెదుటే భర్త మృతి!
- బైకులు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు దుర్మరణం
- ఆటో అదుపుతప్పిన ఘటనలో మరొకరు మృతి

కొనకనమిట్ల: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో శుక్రవారం సంభవించిన ప్రమాదాలు ముగ్గురి ప్రాణాలను బలితీసుకోగా.. మరికొందరిని గాయాలపాలు చేశాయి. మోటార్ సైకిల్ అదుపు తప్పి కింద పడటంతో భర్త మృతి చెందగా భార్యకు గాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి జాతీయ రహదారిపై కొనకనమిట్ల మండలం చేరెడ్డివారిపల్లి సమీపంలో చోటుచేసుకుంది. మార్కాపురం పట్టణానికి చెందిన నారాయణం సుబ్బారావు(52) తన భార్య రమాదేవితో కలిసి బైక్‌పై కనిగిరి నుంచి స్వగ్రామం వస్తున్నారు. ఈ క్రమంలో చేరెడ్డివారిపల్లి వద్ద బైక్ అదుపు తప్పి ఇద్దరూ రోడ్డుపై పడ్డారు. తలకు తీవ్ర గాయం కావడంతో సుబ్బారావు అక్కడికక్కడే మృతి చెందారు. భార్య రమాదేవికి గాయాలయ్యాయి. కళ్ల ముందే భర్త విగతజీవిగా మారడంతో రమాదేవి రోదిస్తున్న తీరు స్థానికులను కంట తడిపెట్టించింది. మోటార్ సైకిల్‌పై వస్తున్న వారిని ఏదైనా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందా లేక అదుపు తప్పి కింద పడ్డారా అనేది తెలియాల్సి ఉంది. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ రాజ్‌కుమార్ పరిశీలించి ప్రమాదం తీరుపై ఆరా తీశారు. సుబ్బారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


మృతుడు సుబ్బారావు


భర్త మృతదేహం వద్ద రోదిస్తున్న రమాదేవి

బైకులు ఢీకొని యువకుడు మృతి

ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన ఒంగోలు–గిద్దలూరు రహదారిపై చినారికట్ల జంక్షన్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. వెలిగండ్ల మండలం నాగులవరం గ్రామానికి చెందిన కాకుటూరి మస్తాన్(23) మెకానిక్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఇటీవల దర్శికి చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో దర్శి నుంచి స్వగ్రామం నాగులవరానికి బైక్‌పై వెళ్తున్నాడు. చినారికట్ల జంక్షన్ సమీపంలో ఎదురుగా వస్తున్న కనిగిరికి చెందిన బ్రహ్మం బైక్.. మస్తాన్ బైక్ బలంగా ఢీకొన్నాయి. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులకు పొదిలి ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలిస్తుండగా మార్గమధ్యంలో మస్తాన్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన బ్రహ్మం చీమకుర్తి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నట్లు సమాచారం. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. మస్తాన్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


మృతుడు మస్తాన్


తీవ్రంగా గాయపడిన బ్రహ్మం

ఆటో అదుపు తప్పి ఒకరు..

పెద్దారవీడు: ఆటో అదుపుతప్పడంతో రైతు మృతి చెందిన సంఘటన పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై పి.అనిల్‌కుమార్ కథనం మేరకు.. బేస్తవారిపేట మండలం కొత్తపేట గ్రామానికి చెందిన రైతులు దూదేకుల ఇబ్రహీం(40), మరో ఇద్దరు కలిసి ఆటోలో మిరప నారు తెచ్చుకోవడానికి హనుమాన్ జంక్షన్ కుంటకు బయలుదేరారు. దేవరాజుగట్టు ఓవర్ బ్రిడ్జిపై వేగంగా వెళ్తున్న ఆటో అదుపుతప్పి ఎస్ఎస్ కళాశాల దగ్గర బ్రిడ్జి రిటైనింగ్ వాల్‌ను ఢీకొని పల్టీ కొట్టింది. ఆటో దూదేకుల ఇబ్రహీంపై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ఉన్న వ్యక్తులు ఇబ్రహీంను నరసరావుపేట వైద్యశాలకు తరలిస్తుండగా త్రిపురాంతకం మండలం గుట్టల ఉమ్మడివరం సమీపంలో మృతి చెందాడు. క్షతగాత్రుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇళ్ల మధ్య మద్యం షాపు వద్దంటూ నిరసన


రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న ఐనముక్కల గ్రామస్తులు


గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

- కర్నూలు–గుంటూరు జాతీయ రహదారిపై రాస్తారోకో
- అర్ధగంట పాటు పూర్తిగా నిలిచిన వాహనాల రాకపోకలు

పెద్దదోర్నాల: తమ గ్రామం సమీపంలో మద్యం షాపు పెట్టొద్దంటూ పెద్దదోర్నాల మండల పరిధిలోని ఐనముక్కల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ శుక్రవారం కర్నూలు–గుంటూరు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో సుమారు అర్ధగంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి రోడ్డుకు ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులను రోడ్డుపై నుంచి పంపించి వేశారు. ఈ సందర్భంగా తమ పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారంటూ పలువురు మహిళలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఎస్సై మహేష్ గ్రామస్తులతో మాట్లాడారు. మద్యం షాపు విషయంపై ఎక్సైజ్ అధికారులకు పిర్యాదు చేయాలన్నారు. పెద్దదోర్నాల మండలానికి మూడు మద్యం షాపులు మంజూరయ్యాయి. వాటిని పెద్దదోర్నాలలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్‌శాఖ అధికారులు అన్ని మద్యం షాపులు పట్టణంలో ఏర్పాటు చేయటం కుదరదని తేల్చి చెప్పారు. మద్యం షాపులను మార్చే ప్రక్రియలో భాగంగా ఐనముక్కలలోని గిరిజన సూపర్ స్పెషాలిటీ వైద్యశాలకు వెళ్లే దారిలో నిర్వాహకులు ఓ మద్యం షాపు పెట్టేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో ఐనముక్కల గ్రామస్తుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలోనే గ్రామానికి చెందిన మహిళలు, యువకులు కర్నూలు– గుంటూరు జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు.

డిసెంబర్ నెలాఖరుకు ఉపాధి పనులు పూర్తి చేయాలి

ఒంగోలు అర్బన్: జిల్లాలో నిర్వహించిన పల్లెపండుగ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సీసీ రోడ్లు, సైడు కాలువల నిర్మాణ పనులను వచ్చే నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా డ్వామా, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద పల్లెపండుగలో మంజూరైన కొత్త పనులపై శుక్రవారం ప్రకాశం భవనంలో సమీక్షించారు. పనులకు సంబంధించి రెండు రోజుల్లో మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఒంగోలు, దర్శి, సంతనూతలపాడు నియోజకవర్గాల పరిధిలో ఉన్న మండలాల్లో పనులు ప్రారంభం కాలేదని, వారంలో ప్రారంభించాలని సూచించారు. సమావేశంలో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, ఎంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్‌ఈఈలు, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని దుప్పి మృతి


దుప్పిని దహనం చేస్తున్న అటవీ శాఖ అధికారులు

ముండ్లమూరు(దర్శి): గుర్తు తెలియని వాహనం ఢీకొని చుక్కల దుప్పి మృతి చెందిన సంఘటన దర్శి మండలంలోని పోలవరం సమీపంలో చోటుచేసుకుంది. అటవీ శాఖ అధికారులు ముండ్లమూరు చేరుకుని దుప్పిని స్వాధీనం చేసుకున్నారు. పంచనామా అనంతరం అటవీ శాఖ అధికారులు దుప్పి కళేబరాన్ని దహనం చేశారు. కార్యక్రమంలో అటవీ శాఖ రేంజ్ అధికారి డి.నరసింహారావు, సెక్షన్ అధికారి మోహన్‌రావు, బీట్ అధికారి ఎస్.అమర తదితరులు పాల్గొన్నారు.